క్లుప్తంగా

వీఎస్‌యూ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

వెంకటాచలం: ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల బాస్కెట్ బాల్ పోటీలకు వీఎస్‌యూ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. కాకుటూరులోని విక్రమ సింహపురి వర్సిటీలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరంలో ప్రతిభకనబర్చిన 12 మంది క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేశారు. వారిని వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి అభినందించారు. బాస్కెట్ బాల్ పోటీల్లో సత్తా చాటి వీఎస్‌యూకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాపీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, డాక్టర్ కే సునీత, వై రవీంద్రమ్మ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌకచర్ల చెరువు చేపల వేలం వాయిదా

విడవలూరు: మండలంలోని చౌకచర్ల చెరువు చేపల వేలం పాటను స్థానిక సచివాలయంలో మత్స్యశాఖ అధికారి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గతంలో చెరువు పాడుకున్న వారు ఇంకా రూ.1.54 లక్షలు చెల్లించాల్సి ఉండడంతో కొత్తగా వేలం పాటలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేదని ఆయన తెలిపారు. దీంతో చేపల వేలం పాటను వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలో మళ్లీ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఓగు నాగేశ్వరావు, మురళీకృష్ణారెడ్డి మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పెసర విత్తనాల పంపిణీ

పొదలకూరు : రైతులకు 30 శాతం సబ్సిడీపై ఐపీఎం 2–14 రకం పెసర విత్తనాలను అందజేస్తున్నట్లు ఏఓ ఏ వాసు శుక్రవారం తెలిపారు. పొదలకూరు, బిరదవోలు, ఇనుకుర్తి, మొగళ్లూరు, ఆర్‌వైపాళెం, తోడేరు, మరుపూరు, తదితర మెట్టప్రాంత గ్రామాల రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షానికి పెసర సాగు చేసే రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లిస్తే ఐదెకరాల వరకు విత్తనాలను అందజేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

రోడ్ల పునర్నిర్మాణానికి నిధులు

ముత్తుకూరు: మండలంలో ఐదేళ్ల క్రితం నిర్మించి దెబ్బతిన్న 18 రోడ్లను పునర్నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని అధికారులు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సుబ్బారెడ్డిపాళెం –నారికేళపల్లిరోడ్డు, పోలంరాజుగుంట రోడ్డు, ముత్తుకూరు బీసీ కాలనీ–మామిడిపూడి రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ, మండలంలో తాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.20 కోట్లతో 51 పనులు చేపట్టనున్నట్లు వివరించారు. వ్యవసాయాధికారి జోత్స్నరాణి మాట్లాడుతూ ఈ నెల 13న నిర్వహించనున్న ఐఏబీ సమావేశం తరువాత సాగునీటి విడుదల విషయం స్పష్టమవుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, హార్టీకల్చర్ డైరెక్టర్ దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీడీఓ లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

హరిత దీపావళిని జరుపుకొందాం

కొడవలూరు: హరిత దీపావళిని జరుపుకొందామని నార్తురాజుపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డీ ఓబులేసు పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కోర్ డే సందర్భంగా నార్తురాజుపాళెంలో ఉన్నత పాఠశాలలో హరిత దీపావళిపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళికి టపాకాయలు కాల్చడం మన సంప్రదాయం కాదన్నారు. దీపాలను మాత్రమే వెలిగించి దీపావళి జరుపుకోవాలన్నారు. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కే భక్తవత్సలబాబు, ఉపాధ్యాయులు చిట్టిబాబు, రఫీఅహ్మద్, ఎస్ మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ తోటల పరిశీలన

పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి సోషల్ ఫారెస్ట్ నర్సరీ, ముదిగేడులోని డ్రాగన్ ఫ్రూట్ తోటలను పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ కోన శశిధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి కొత్తగా ఉపాధి పనులను గుర్తించి కూలీలందరికి పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా నాలుగు లక్షల మొక్కలను నాటాల్సి ఉందన్నారు. నర్సరీల్లో అధిక సంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. రైతులు ఉద్యాన పంటల సాగులో భాగంగా పండ్ల తోటల పెంపకం చేపట్టేలా ఉపాధి కింద ప్రోత్సహించాలని ఆదేశించారు.

నిబంధనలను విధిగా పాటించాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలతో తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): బాణసంచా విక్రయ, తయారీదారులు నిబంధనలను విధిగా పాటించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫైర్ అలారమ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అధికారులు అనుమతించిన ప్రదేశాల్లోనే విక్రయ, నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, విక్రయాలు జరుగుతున్నాయని గుర్తిస్తే స్థానిక పోలీసులు, డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను విధిగా ధరించాలని ఎస్పీ ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే తొలిసారి ఫైన్, రెండోసారి లైసెన్స్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పరీక్షల్లో పట్టుబడిన వారికి న్యాయమూర్తులు రూ.పది వేల జరిమానాను విధిస్తున్నారని చెప్పారు.

ప్రతిభకు ప్రశంస

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీస్, ఎస్‌ఈబీ అధికారులను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో వీరికి ప్రశంసపత్రాలను అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీ, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు ప్రశంసపత్రాలను అందుకున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని పోలీస్ సిబ్బంది, వారి పిల్లలు, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అందజేశారు. సోషల్ మీడియా దుర్వినియోగం – సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతిక పాత్ర అనే అంశంపై పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దగదర్తి కానిస్టేబుల్ కవిత, కొండాపురం కానిస్టేబుల్ మంజుషా, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కుశ్వంత్‌కుమార్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అదే విధంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు మూడు వినతులు


మాట్లాడుతున్న శివకేశవ్‌యాదవ్

నెల్లూరు సిటీ: నగరంలోని నెల్లూరు – 1, 2 డిపోల పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాలను మేనేజర్లు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా శుక్రవారం నిర్వహించారు.

• పామూరు నుంచి తిరుపతికి బస్సును ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కోరారు. పల్లె వెలుగు బస్సుల లైవ్ ట్రాకింగ్‌లో తప్పులొస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు.

• స్లీపర్ బస్సులకు ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేయాలని సురేంద్రబాబు కోరారు. మైపాడు గేట్ మీదుగా పాత చెక్ పోస్ట్, శెట్టిగుంట రోడ్డు, రైల్వేస్టేషన్ మీదుగా పీఎస్సార్ బస్టాండ్‌కు బస్సులను ఏర్పాటు చేయాలని ఇందుకూరుపేటకు చెందిన శర్వాణి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై చర్యలు చేపడతానని రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ హామీ ఇచ్చారు.

నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలను అందుకున్న వారితో ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జెడ్పీ కార్యాలయంలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించారు. ఈ మేరకు జూనియర్ సహాయకుడిగా ఒకరికి, ఆఫీస్ సబార్డినేట్లుగా ఆరుగురికి నియామకాలను కల్పిస్తూ ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అందజేశారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నేతలు

నెల్లూరు (టౌన్): మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక నేతలు కోరారు. ఈ మేరకు బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్ శ్రీనునాయక్, జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, నగర కార్యదర్శి రాము, సభ్యులు మురళి, వీరాస్వామి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి నగదు ప్రోత్సాహకం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన నరేంద్రకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నగరంలోని వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహ సమీపంలో గల స్లిమ్ లైఫ్ జిమ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఎస్పీ మధుసూదన్‌రావు మాట్లాడారు. కోవూరు మండలంలోని నిరుపేద కుటుంబంలో కష్టాలను ఎదుర్కొని అంతర్జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికవ్వడాన్ని అభినందించారు. రష్యా రాజధాని మాస్కోలో నిర్వహించనున్న సీనియర్ రెజ్లింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన నరేంద్రను సత్కరించి రూ.లక్షను చెక్కును అందజేశారు. కోచ్ ప్రేమ్‌కుమార్, జిమ్ యజమాని ఖాన్, పెంచలయ్యనాయుడు, వంశీ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో గల సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శాంతినగర్, బట్వాడిపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

• రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని రైల్వేవీధి ఫీడర్‌లో 11 కేవీ ఏబీ స్విచ్‌ను ఏర్పాటు చేయనున్న తరుణంలో కపాడిపాళెం, రైల్వేస్టేషన్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

• ఎమ్మీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎమ్మెస్సార్ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, డీఈఓ కార్యాలయం, కిమ్స్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాద్రి ఫీడర్, పడారుపల్లి సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా మాగుంట లేఅవుట్, కింగ్స్ కోర్టు అవెన్యూ, లెక్చరర్స్ కాలనీ, పడారుపల్లి, సప్తగిరి కాలనీ, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

• హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పార్థసారథినగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా హరనాథపురం, పార్థసారథినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• గోమతినగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా గోమతినగర్, ఇస్కాన్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో వీవర్స్‌కాలనీ, బోడిగాడితోట, లక్ష్మీపురం, శెట్టిగుంటరోడ్డు, జాకీర్ హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

• రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా రామ్మూర్తినగర్, శ్రీనివాసాగ్రహారం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

• ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా సరస్వతీనగర్, రాయపుపాళెం, శ్రీనగర్, ఎన్టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

బీటీఏ జిల్లా కౌన్సిల్ సమావేశం నేడు

నెల్లూరు (టౌన్): బీటీఏ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటీఏ కార్యక్రమాలపై చర్చించనున్నామని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నామని వివరించారు.

కామాక్షితాయికి ప్రత్యేక పూజలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నిత్య కల్యాణంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ గిరికృష్ణ, చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు



విడవలూరు: మండలంలోని పీఆర్ఆర్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదో ఆంధ్రా నేవి పీఓఎంఈ అల్లు ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఎంపికలను శుక్రవారం నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న 27 మంది విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపల్ బీ సుజాత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశానికి సేవ చేయాలనే ఆలోచన కలిగిన యువతకు ఎన్‌సీసీ మంచి వేదికన్నారు. ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ ఎస్‌కే న్యామతుల్లా, నీలేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కాకాణి జన్మదిన వేడుకలు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకని పొదలకూరులోని షాదీమంజిల్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సర్వారెడ్డికాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. మరుపూరు పాఠశాలలో వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సచివాలయ కన్వీనర్లు ఎస్‌కే అంజాద్, బీ భారతమ్మ, సతీష్‌రెడ్డి, పార్టీ మండల యువత అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. 275 మంది యువకులు రక్తదానం చేశారు. పైనాపురం పంచాయతీలోని దేవరదిబ్బ గిరిజనకాలనీలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ వెంకటరమణయ్య, ఎంపీటీసీలు విజయకుమార్‌రెడ్డి, నవీద్‌బాషా, పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్‌లు ఆలపాక శ్రీనివాసులు, పెంచలప్రతాప్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(బారకాసు): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎఫ్ఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించారు. దాదాపు 50 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. అటవీ శాఖ సిబ్బందికి నేత్ర, దంత పరీక్షలను స్మార్ట్ విజన్ ఆస్పత్రి, స్మైల్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, కార్యదర్శి రవీంద్ర, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ట్రెజరర్ ఓంప్రకాష్, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహాల ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో భవానీ శంకరుడు, నందీశ్వర, ఆంజనేయస్వామి నూతన శిలా విగ్రహాల ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి వాణి మల్లీశ్వరి దంపతులు, నర్రావుల మల్లీశ్వరి తదితరులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, రమణమ్మ, తిక్కవరపు శ్రీనివాసులు రెడ్డి, స్రవంతి దంపతులు పాల్గొన్నారు.

ఇంటి బయటే విద్యుత్ మీటర్ ఉండాలి


మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ వినియోగదారులు వారి మీటర్లను ఇంటి బయటే ఏర్పాటు చేసుకోవాలని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి కోరారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. నగరంలోని చాలా మంది వినియోగదారులు వారి ఇల్లు, దుకాణాల లోపల మీటర్లను ఏర్పాటు చేసుకోవడంతో రీడింగ్ సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఇంటి బయటే ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

రేపటితో ముగియనున్న హ్యాండ్లూమ్ ఎక్స్‌పో



నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో గల మైదానంలో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ షాపింగ్ ఎక్స్‌పో ఆదివారంతో ముగియనుందని నిర్వాహకులు దీపక్, శ్రీవిద్య, కైజర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్తకళా ఉత్పత్తులకు ఆదరణ కల్పించాలనే ఉద్దేశంతో ఉత్పత్తి ధరలకే అందిస్తున్నామని వివరించారు. కలంకారీ, బెంగాలీ కాటన్, చాందినీ శారీస్, డ్రస్ మెటీరియల్స్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ బెడ్ షీట్స్, భాగల్‌పూరీ సిల్క్స్, ఖాదీ షర్ట్స్ తదితరాలను 90కిపైగా స్టాళ్లలో ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శన, విక్రయాలు జరగనున్నాయని పేర్కొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని ఎంపీపీ స్కూల్లో దీపావళి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. పిల్లలతో బాణసంచాను కాల్పించి జాగ్రత్తలను బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రామయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గణేశ్ ఘాట్


పరిశీలిస్తున్న దీపా వెంకట్

నెల్లూరు(బృందావనం): నగరంలోని గణేశ్ ఘాట్ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పేర్కొన్నారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన వద్ద గల ఘాట్‌ను శుక్రవారం సందర్శించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న మహా కార్తీక దీపోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు.

ఘాట్ అభివృద్ధికి స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా తమ వంతు తోడ్పాటు ఉంటుందని వెల్లడించారు. స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ ప్రక్రియను చేపడతామన్నారు. దీపోత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల, బయ్యా మల్లిక, కోడూరు జయప్రద, ముక్కాల వ్యాసప్రసాద్, మోహన్‌రావు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వీరరాఘవయ్య నాయీబ్రాహ్మణ కల్యాణ మండపంలో ధన్వంతరి జయంతిని వేలూరు రంగారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్యులు జయచంద్ర, రవీంద్రనాథ్ టాగూర్, సుమంత్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.